కౌంటింగ్ కేంద్రానికి రాని బీజేపీ అభ్యర్థి రవికుమార్ యాదవ్

గచ్చిబౌలి: జాతీయ, రాష్ట్ర నాయకులతో ప్రచారంలో దూసుకెళ్లిన బీజేపీ అభ్యర్థి ఎం.రవికుమార్ యాదవ్ కౌంటింగ్ కేంద్రానికి రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన కౌంటింగ్‌కు రవికుమార్ వస్తారని అందరు భావించారు. ఐతే ఎగ్జిట్‌పోల్స్ చూసిన ఆయన కొంత నిరాశకు లోనైనట్లు తెలుస్తోంది.

ప్రజా తీర్పును గౌరవిస్తున్నా...



ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నామని బీజేపీ అభ్యర్థి ఎం.రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. తనకు ఓటు వేసిన ఓటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. గెలుపొందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం భరతనాట్య కళాకారిణి అనూష తన ప్రదర్శనతో అలరించింది. ఇందులో మేశప్రాప్తి, కృతి, రారా రాజీవలోచన, పదం, శ్రీసరస్వతీ ఆశ్రయామి అంశాలను ప్రదర్శించారు. ప్రముఖ నాట్యగురువు నిర్మలా ప్రభాకర్ శిష్యబృందంచే భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. ఇందులో శ్లోకాలు, వినాయకస్తుతి, అలరిపు, శివస్తుతి, త్యాగరాజ కీర్తన, తరంగం, తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాకారులు ప్రముఖ గురువు అంజుబాబు, సువర్ణలత, కుసుమ బోగరాజు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యేగా అరెకపూడి గాంధీ హ్యాట్రిక్ విజయం సాధించారు. ఈ సందర్భంగా పలు డివిజన్‌ల కార్పొరేటర్‌లు, బీఆర్‌యస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి శుభాకాంక్షలు తెలిపారు.

యూటీఎఫ్ సీనియర్ నాయకులు దత్ మృతి

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర యూటీఎఫ్ సీనియర్ నాయకులు దత్ అనారోగ్యంతో మృతి చెందారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సీనియర్ నాయకులుగా గుర్తింపు పొందిన అక్షయ కుమార్ దత్(77) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమరావతి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పనిచేసి 2004లో ఉద్యోగ విరమణ పొందారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా, రాష్ట్ర అకడమిక్ కమిటీ కన్వీనర్, చైర్మన్, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘకాలం పాటు పనిచేశారు. ఉద్యోగ విరమణ అనంతరం హైదరాబాద్ నగరంలో స్థిరపడ్డారు. అప్పటి నుంచి 2021 వరకు యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో కార్యకర్తగా పనిచేశారు.ఆయన మృతి పట్ల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసింది.

హ్యాట్రిక్ హీరో మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావు భారీ మెజార్టీతో హ్యాట్రిక్ విజయం సాధించారు. 2014 నుంచి తన మెజార్టీని పెంచుకుంటూ కూకట్‌పల్లి ఎమ్మెల్యేగా విజయం సాధిస్తున్నారు. 2014లో 40వేల మెజార్టీ, 2018లో 42వేల మెజార్టీ మూడోసారి ఏకంగా 70వేల ఓట్లతో గెలిచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా నిలిచారు. దీంతో కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున సంబురాలు చేసుకున్నారు.

– కూకట్‌పల్లి

కూకట్‌పల్లి: బీఆర్‌ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావు ప్రతి రౌండ్‌లో మెజార్టీ సాధిస్తూ తన ఆధిపత్యాన్ని చూపించారు. మొదటి రౌండ్ నుంచి 22వ రౌండ్ వరకు ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ 70,405 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. నియోజకవర్గంలో ఎల్లవేళలా అందుబాటులో ఉండే మాధవరం కృష్ణారావును అన్ని వర్గాల ప్రజలు ఆదరించారు. కుల, మత, ప్రాంత బేదాభిప్రాయం లేకుండా అన్ని వర్గాల వారు ఆయనకు ఓటు వేసి విజయాన్ని చేకూర్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ హవా నడుస్తున్నప్పటికీ కూకట్‌పల్లిలో బీఆర్‌ఎస్ భారీ మెజార్టీతో గెలిచారు. స్థానికంగా సెటిలర్స్ కాంగ్రెస్‌కు ఓటు వేస్తారని ప్రచారం జరిగినప్పటికీ సెటిలర్స్ నుంచి కూడా భారీ స్థాయిలో మాధవరం కృష్ణారావుకు ఓట్లు పోలయ్యాయి.

అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలు..

కూకట్‌పల్లి నియోజకవర్గంలో మొత్తం ◆ 4,63,864 ఓట్లు ఉన్నాయి. గత నెల 30వ తేదీన జరిగిన ఎన్నికల్లో ◆ 2,50,064 ఓట్లు పోలయ్యాయి. అందులో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి మాధవరం కృష్ణారావుకు ◆ 1,35,635 ఓట్లు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్‌కు ◆ 65,248 ఓట్లు, జనసేన పార్టీ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్‌కు ◆ 39830 ఓట్లు వచ్చాయి. ప్రధాన పార్టీ అభ్యర్థులకు తప్ప మిగతా అభ్యర్థులకు నోటా ఓట్ల కంటే తక్కువ వచ్చాయి. నోటాకు ◆ 2446 ఓట్లు రాగా, బీఎస్పీకి ◆ 1371 ఓట్లు వచ్చాయి. కాగా స్వతంత్ర అభ్యర్థి బాశెట్టి నర్సింగ్‌రావుకు ◆ 1769 ఓట్లు వచ్చాయి.

విజయోత్సాహం .. గులాబీ శ్రేణుల సంబురాలు

డ్యాన్సులు చేస్తూ.. స్వీట్లు పంచుతూ హర్షం వ్యక్తం చేసిన నేతలు



బాలాజీనగర్ డివిజన్‌లో సంబరాల్లో మాజీ కార్పొరేటర్ బాబూరావు , నాయకులు

ఓల్డ్‌బోయిన్‌పల్లి/మూసాపేట: కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావు ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో హ్యాట్రిక్ విజయం సాధించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. బాణసంచా కాల్చుతూ జై తెలంగాణ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కృష్ణారావు అభిమానులు డ్యాన్స్ ఆడుతూ.. స్వీట్లు పంచుతూ తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు. మాధవరం కృష్ణారావును కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్, నాయకులతో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, సీనియర్ నాయకులు నరేందర్‌గౌడ్, వేణుగోపాల్‌రెడ్డి, బల్‌రాజు, బుర్రి యాదగిరి, మక్కాల సత్యనారాయణ, వీరాస్వామి, చందుయాదవ్, ఇబ్బు, లలితా, శాలిని, దుర్గ, అంబటి శ్రీనివాస్, నర్సింగ్, జగదీష్, చున్నూ పాషా, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ హ్యాట్రిక్ విజయం

- మొదటి నుంచీ బీఆర్‌ఎస్‌కు స్పష్టమైన మెజార్టీ
- ప్రతి రౌండ్‌లోనూ లీడ్‌లో..



భారీ మెజార్టీతో గెలిచిన బీఆర్‌ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీకి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న రిటర్నింగ్ ఆఫీసర్ బి.శ్రీనివాస్‌రెడ్డి

గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక ఓటర్లు కలిగిన నియోజకవర్గంగా పేరున్న శేరిలింగంపల్లిలో ఓట్ల లెక్కింపు ప్రారంభం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులపై స్పష్టమైన ఆధిక్యతను చూపారు. మొదటి రౌండ్ నుంచి మెజార్టీ కనపడింది. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ 1,56,577 ఓట్లతో హ్యాట్రిక్ విజయం సాధించారు. 46,647 ఓట్ల మెజారిటీతో గాంధీ మూడోసారి గెలుపొందారు.సమీప అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్ 1,09,930 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి 79,664 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. నోటాకు 3141 ఓట్లు రాగా బీఎస్పీ అభ్యర్థి ఒంగోరు శ్రీనివాస్ యాదవ్‌కు 1113 వచ్చాయి. మొత్తం 31 మంది బరిలో ఉన్నా ప్రధాన పార్టీల అభ్యర్థులను మినహాయిస్తే మిగతా వారు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు.

ఎక్కడా తగ్గేదేలే అంటూ బీఆర్‌ఎస్ ఆధిక్యత..

శేరిలింగంపల్లిలో ఓట్ల లెక్కింపు ప్రక్రియలో 23 రౌండ్లు ఉండగా ప్రతి రౌండ్‌లోనూ గాంధీ ఆధిక్యతను చాటారు. మొత్తం 23 రౌండ్లలో ఒక్క 12వ రౌండ్‌లో అత్యధికంగా 5,970 ఓట్లు మెజార్టీ సాధించగా 20వ రౌండ్‌లో అత్యల్పంగా 421 ఓట్ల మెజార్టీ సాధించారు. ఇక 3వేలకు పైచిలుకు ఓట్లను 10వ రౌండ్‌లో సాధించగా, ఆతర్వాత 2వేలపై చిలుకు ఓట్లను 2,13,14,16,21,22,23 రౌండ్‌లలో సాధించారు. ఇక మిగిలిన అన్ని రౌండ్లలో వెయ్యికి తగ్గకుండా వచ్చారు. ఇదిలావుండగా ఒక్క 20వ రౌండ్‌లో మాత్రమే 421 స్వల్ప ఆధిక్యత లభించింది.

ఓటరు దేవుళ్లకు ధన్యవాదాలు

హఫీజ్‌పేట్: శేరిలింగంపల్లి ఓటరు దేవుళ్లకు ధన్యవాదాలు అని హ్యాట్రిక్ విజయం సాధించిన ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేస్తూ ముందుకు నడుస్తానన్నారు. ప్రజల తరపున, నా తరపున కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.



స్టేడియం వద్ద మాట్లాడుతున్న గాంధీ

శేరిలింగంపల్లిలో రౌండ్ల వారీగా..

రౌండ్	గాంధీ (బీఆర్‌ఎస్)	జగదీశ్వర్‌గౌడ్ (కాంగ్రెస్)	రవికుమార్ (బీజేపీ)	మెజార్టీ
1.	6,582	4,382	5,338	1,244
2.	8,002	5,756	5011	2,246
3.	5,861	4,578	3,703	1,283
4.	5,920	4,452	3,344	1,468
5.	6,800	5,507	3,435	1,293
6.	6,204	4,620	3,200	1,584
7.	6,252	4,923	3,566	1,328
8.	5,837	4,549	3,316	1,288
9.	6,500	4,858	3,149	1,642
10.	8,973	5,844	3,276	3,079
11.	6,037	4,815	2,384	1,222
12.	9,593	3,623	2,394	5,970
13.	7,062	5,037	3,367	2,025
14.	6,699	3,901	4,389	2,598
15.	6,210	5,202	3,729	1,008
16.	6,915	4,157	3,969	2,858
17.	6,682	5,312	2,849	1,370
18.	7,185	5,332	3,195	1,853
19.	6,677	4,942	3,143	1,735
20.	5,535	5,114	2,742	0,421
21.	7,259	4,686	2,980	2,573
22.	7,396	4,473	3,920	2,923
23.	6,399	3,817	3,265	2,582
మొత్తం	1,56,577	1,09,930	79,664	46,647 (3,55,692)

అన్ని వర్గాలు బీఆర్‌ఎస్‌ను ఆదరించాయి

- స్వల్పంగా పెరిగిన మెజారిటీ
- కాంగ్రెస్‌కు ఆశాభంగం
- మూడింతలు ఓట్లు పెంచుకున్న బీజేపీ

గచ్చిబౌలి: శేరిలింగంపల్లిలో బీఆర్‌ఎస్ పార్టీని అన్ని వర్గాలు ఆదరించాయి. కమ్మ సామాజిక వర్గం ఓట్లు కాంగ్రెస్‌కు పడతాయని ప్రచారం జరిగినా ..బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ అదే సామాజికవర్గానికి చెందిన వ్యక్తి కావడంతో ఆయనకే ఆ ఓట్లు పడ్డట్లు తెలుస్తోంది. గాంధీ 1,56,577 ఓట్లు సాధించారు. కమ్మ సామాజిక వర్గం ఓట్లు గంపగుత్తగా కాంగ్రెస్‌కు పడతాయని ప్రచారం జరిగినా ఆ పార్టీ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్‌కు 1,9,930 ఓట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. 2018 ముందస్తు ఎన్నికలలో గాంధీ 1,43,307, టీడీపీ అభ్యర్థి భవ్య ఆనంద్ ప్రసాద్‌కు 99,012 ఓట్లు వచ్చాయి. 44,295 ఓట్లతో గాంధీ గెలుపొందారు. గతంలో కంటే 2,352 ఓట్లు ఎక్కువగా సాధించడం గమనార్హం.

ఐటీ కారిడార్‌లో కాంగ్రెస్‌కు..

రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ గాలి వీచినా ఐటీ కారిడార్‌లో మాత్రం ఓటర్లు బీఆర్‌ఎస్‌కు పట్టంకట్టారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన జగదీశ్వర్‌గౌడ్‌ను అధిష్టానం శేరిలింగంపల్లి అభ్యర్థిగా ప్రకటించింది. 15 ఏళ్ల పాటు కార్పొరేటర్‌గా పనిచేసిన అనుభవంతో ప్రచారంలో దూసుకెళ్లారు. ఓటింగ్‌కు కొద్ది రోజుల ముందు నుంచే ప్రచారం చేసిన లక్షా 9,930 ఓట్లు సాధించారు. లోకల్, సెటిలర్స్ ఓట్లు భారీ సంఖ్యలో పడతాయని భావించారు. ఆశించిన స్థాయిలో ఓట్లు రాలేదు.

పెరిగిన బీజేపీ ఓట్లు

శేరిలింగంపల్లి బీజేపీ అభ్యర్థి ఎం.రవికుమార్ యాదవ్ గతంతో పోలిస్తే మూడింతలకు పైగా ఓట్లు సాధించారు. 2018 బీజేపీ అభ్యర్థి గజ్జెల యోగానంద్‌కు 22,106 ఓట్లు వచ్చాయి. ప్రస్తుతం రవి కుమార్‌యాదవ్‌కు 79,664 ఓట్లు వచ్చాయి. గతం కంటె 57,558 ఓట్లు ఎక్కువగా వచ్చాయి. లోకల్, నార్త్ ఇండియన్ ఓట్లు తమ వైపు వస్తాయని భావించినా ఆ స్థాయిలో రాకపోవడంతో మూడవ స్థానంతో సరిపెట్టుకున్నారు.

మరింత బాధ్యతగా పని చేస్తా

- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



గచ్చిబౌలి: మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా మరింత బాధ్యతగా పని చేస్తానని గాంధీ పేర్కొన్నారు.గత తొమ్మిదేళ్లలో చేసిన అభివృద్ధే గెలిపించిందన్నారు. నాయకులంతా ఏకతాటిపైకి వచ్చి గెలుపు కోసం కృషి చేశారని అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఆదరించిన ఓటర్లకు రుణపడి ఉంటా

- జగదీశ్వర్ గౌడ్



గచ్చిబౌలి: ఎన్నికలలో గెలుపు ఓటములు సహజమని, ప్రజాతీర్పును గౌరవిస్తానని కాంగ్రెస్ అభ్యర్థి వి.జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. నన్ను నమ్మి 1,9,930 మంది ఓట్లు వేశారని వారందరికి రుణపడి ఉంటానని తెలిపారు. శేరిలింగంపల్లి ప్రజల వెంట ఉంటానన్నారు. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి నాయకత్వంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వెల్లడించారు.

పెరిగిన నోటా ఓట్లు..

రంగారెడ్డినగర్: అసెంబ్లీ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నోటా ఓట్లు పెరుగుతూ వస్తున్నాయి.. 2018 ఎన్నికల్లో మొత్తం 2 లక్షల 89 వేల 368 ఓట్లు పోలవగా 2,976 మంది నోటాకు ఓటేశారు. తాజాగా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 4,01,667 ఓట్లు నమోదు కాగా 4,079 మంది నోటాపై ఓటేశారు. దీంతో మొత్తం పోలైన ఓట్లలో 1.01 శాతం ఓటర్లు ఏ పార్టీకి మొగ్గ చూపకుండా నోటాపై ఓటేయ్యడం గమనార్హం.

లక్ష పుష్పార్చన

పటాన్‌చెరు టౌన్: కార్తీక సోమవారం సందర్భంగా పట్టణంలోని టోల్‌గేట్ సమీపంలోని శ్రీ రామలింగేశ్వర దేవస్థానం, జెపి కాలనీలోని శ్రీ ఉమామహేశ్వర దేవస్థానం ,చైతన్య నగర్ కాలనీలోని మహాదేవుని ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ అర్చకులు తెలిపారు. రామలింగేశ్వర దేవస్థానంలో లక్ష పుష్పార్చన, అన్నదానం జరుగుతుందని ఆలయ అర్చకుడు మహేష్ తెలిపారు.

మురుగు సమస్య



మియాపూర్‌లోని బొల్లారం రోడ్డులో న్యూ కాలనీ వద్ద..

మియాపూర్ : ప్రధాన రహదారులపై మురుగు ప్రవాహంతో కాలనీవాసులు ఇబ్బందులుపడుతున్నారు. కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి చేశామని ప్రజాప్రతినిధులు చెప్పుకుంటున్నా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే కాలనీ, బస్తీలలో మురుగు సమస్యతో ఇబ్బందులుపడుతున్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ సామర్థ్యం సరిపోకపోవడం, పాతవి కావడంతో మురుగు నీరు మ్యాన్‌హోల్‌ల నుంచి పొంగి రోడ్లపై ప్రవహిస్తుంది. సమస్యను స్థానిక అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా సంవత్సరాలు గడుస్తున్నా సమస్య పరిష్కారం అవడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు చేసిన ప్రతిసారి ఏదో నామమాత్రంగా పరిష్కరించి వెళ్తున్నారే తప్ప.. శాశ్వత పరిష్కారం చూపడం లేదు.

◆ మియాపూర్ డివిజన్ పరిధిలోని న్యూకాలనీ, లక్ష్మీనగర్‌కాలనీ, దత్తసాయి కాలనీ, లక్కి రెస్టారెంట్ వెనుక కాలనీలో మురుగు రోడ్లపై ఏరులై పారుతుంది. దీంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మియాపూర్ జేపీనగర్‌లో ప్రధాన రహదారిపై మురుగునీరు రెండు నెలల నుంచి పారుతోంది. మురుగునీటి సమస్యను పరిష్కరించకుండా సీసీ రోడ్డు వేయడంతో మురుగునీరు మ్యాన్‌హోళ్ల నుండి పొంగి సీసీ రోడ్డుపై ప్రవహిస్తుంది

◆ మియాపూర్‌లోని బొల్లారం రోడ్డులో న్యూ కాలనీ వద్ద గత ఆరు నెలల నుండి మురుగునీరు రోడ్డుపై పారుతున్నా పట్టించుకోవడం లేదు. రోడ్డువెంబడి ప్రతిరోజు వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో మురుగునీటిలో నుండే వెళ్లాల్సి వస్తుంది. భారీ వాహనాలు వెళ్లే సమయంలో పాదచారులపై మురుగునీరు పడి ఇబ్బందిపడుతున్నారు. పరిసరాలు దుర్వాసన వెదజల్లుతున్నాయని వాపోతున్నారు.

◆ అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



బొల్లారం రోడ్డులో ప్రధాన రహదారిపై ..



లక్ష్మీనగర్ కాలనీలో..



గచ్చిబౌలి స్టేడియం వద్ద బీఆర్‌ఎస్ నాయకుల కోలాహలం

బీఆర్‌ఎస్ సంబురాలు

- డప్పులు...డ్యాన్సులు.. స్వీట్ల పంపిణీ



గాంధీని ఎత్తుకున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు

హఫీజ్‌పేట్/శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ హ్యాట్రిక్ విజయం సాధించడంతో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సంబరాల్లో మునిగితేలారు. గచ్చిబౌలి -లింగంపల్లి వరకు గులాబీమయంగా మారింది. స్టేడియం పరిసరాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో సందడి నెలకొంది.

గచ్చిబౌలి స్టేడియం–లింగంపల్లి ర్యాలీ

బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ గెలుపు ప్రకటన రాగానే పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గాంధీ స్టేడియం బయటకు రాగానే స్వీట్లు తినిపించి, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గచ్చిబౌలి స్టేడియం నుంచి నినాదాలు ,డప్పు చప్పుళ్ళతో హెచ్‌సీయూ, హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో, జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయం, ఆలింద్, గుల్‌మొహర్‌పార్కు మీదుగా లింగంపల్లి వరకు భారీ ర్యాలీగా తరలివెళ్ళారు. గచ్చిబౌలి, లింగంపల్లి, చందానగర్, మియాపూర్,హాఫీజ్‌పేట్, మాదాపూర్, కొండాపూర్, కొత్తగూడ, రాయదుర్గం ప్రాంతాలలో టపాసులు పేల్చి, అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. ఆయా చోట్ల ప్రధాన కూడళ్ళలో బీఆర్‌ఎస్ నాయకులు స్వీట్లు పంపిణీ చేశారు.



విజయోత్సాహంతో స్టేడియం నుంచి బయటకు వస్తున్న ఎమ్మెల్యే గాంధీ